# 'మహామనీషి'

గుంటూరు కృష్ణమూర్తి అధ్యయనం కేంద్రం వారు ఆయన పుస్తకం 'విద్య' అచ్చువేశారు. ఆ పుస్తకం వెనుక అట్టమీద ఈ క్రింది వాక్యాలు ముద్రించివుంటాయి.

"మనకు వున్న ప్రధాన సమస్య పిల్లలను ఎలా విద్యావంతుల్ని చేయాలన్నది కాదు, ఉపాధ్యాయుల్ని ఎలా విద్యావంతుల్ని చెయ్యాలన్నదే... విద్య అంటే ఎలా లెక్కలు చేయాలో, ఎలా వంతెనలు కట్టాలో, అణుశక్తినెలా ఉపయోగించుకోవాలో నేర్చుకునే ప్రక్రియ మాత్రమే కాదు. అల్పత్వాన్నుండి, అవివేకపూరితమైన ఆకాంక్షల నుండి మనిషి బయటపడ్డంలో సహాయపడడం విద్య ప్రధాన ధర్మం.

శతాబ్దాల భారాన్ని మోసుకుని వస్తున్న అజ్ఞాత మనసుకు గల అనేక పొరలలోని బలమైన శక్తులను, సూక్ష్మమైన అంశాలను ప్రాజ్ఞతతో వివేకంతో పరిశీలించాలి. 'నేను' అన్న సంకుచిత పరిధి నుండి స్వేచ్ఛ పొందడానికి విద్య తోడ్పడాలి. విద్యకు సరైన అర్థం తన గురించి తాను తెలుసుకోడమే. తన గురించి తాను తెలుసుకుంటే విశ్వాన్నంతా తెలుసుకున్నట్టే." ప్రస్తుతం భ్రష్టుపట్టివున్న విద్యారంగంలో, చదువు అన్నది అంగడి వస్తువైన సమయాన, పదీ, ఇంటర్మీడియట్ చదివేసి అజ్ఞానపూరితమై వున్న పిల్లలను టీచర్లుగా పెట్టుకుని కుక్క గొడుగుల్లా వెలిసిన కాన్వెంట్లున్న మనదేశంలో, పైన ఉదహరించిన జిడ్డు కృష్ణమూర్తిగారి మాటలు ఎందరి చెవులకెక్కుతాయి.

"విద్య అన్నది పిల్లల తలల్లోకి విషయాన్ని కూరడం కాదు. లోపలి విషయాన్ని వెలికి తీయడం" అన్న గిజుభాయి మాట ఎవరు లెక్క చేస్తారు?

ఎల్.కె.జి.కింత, యు.కె.జి కింత అని డొనేషన్లు కట్టుకుంటూ ఆ సీట్లకు కూడా రెకమెండేషన్లూ సిఫార్సులూ తెచ్చుకుంటూ పిల్లల్ని చిత్రహింసలపాలు చేస్తూ మొదటి నేరస్తులుగా నిలిచేది తల్లిదండ్రులే. అలాంటి వాళ్లకిక్కడ జిడ్డు కృష్ణమూర్తిగారి పుస్తకం 'విద్య'లోని కొన్ని మాటలు ఉటంకిస్తున్నాను అవధరించండి.

"జీవితాన్ని సమగ్రంగా అనుభవించడంలో సరైన విద్య సహాయపడుతుంది / నేటి విద్య మంచి ఇంజనీర్లనూ, ప్రతిభావంతులైన శాస్త్రజ్ఞులనూ, సమర్థులైన యజమానులను, మంచి నైపుణ్యం ఉన్నవారిని మాత్రమే తయారుచేస్తున్నది. జీవిత సంపూర్ణతను అర్థం

చేసుకునే సమగ్ర మానవులుగా తీర్చిదిద్దలేకపోతోంది. ఇటువంటి విద్య వినాశనానికి దారి తీస్తుందని నేటి ప్రాపంచిక పరిస్థితి తెలియజేస్తుంది.

నేటి సమాజంలో ఒక వృత్తి, ఉద్యోగం తప్పవు. కానీ పరీక్షలు పాసవడం, డిగ్రీలు సంపాదించడం, ఒక జీవనాన్ని సంపాదించడమే విద్యాలక్ష్యం అనుకున్నప్పుడు క్రమంగా వికసించే శక్తి కోల్పోతాము. మన జీవితంలో ధనార్జనే లక్ష్యమైనప్పుడు, జీవిత వ్యాసంగాలలో సమతుల్యత పోతుంది. నేటి విద్య కేవలం ఒక రంగంలోనే శిక్షణనిస్తుండడం వలన, మన మనసులు సంకుచితమై నియమితమై అసంపూర్ణంగా ఉంటున్నాయి.

ఇదండీ... 123పేజీల 'విద్య' అనే పుస్తకంలో ఓ రెండు పారా గ్రాపుల మాత్రమే నేనుదహరించింది.

కొన్నేళ్ల క్రిందట మద్రాసులో వుండగా జిడ్డు కృష్ణమూర్తిగారు వచ్చి వున్నారని తెలిసింది. హుటాహుటిని అడయార్ పరిగెత్తాను. నేవెళ్లేసరికి ఆయన ప్రసంగం అయిపోయింది. అందరూ కదుల్తూన్నారు. నేను వెళ్లి ఆయనకు అభివాదం చేసి “నేను మీ అభిమానిని” అన్నాను. ఆయన చిరునవ్వు నవ్వుతూ...

“అయితే నేను కూడా మీ అభిమానినే” అన్నారు. అని...

“నేటి సంఘర్షణ పూరిత, అభద్రతాభరిత సమాజంలో మనిషి సాటి మనిషిని అభిమానించడం, ప్రేమించడం అన్నది అత్యంత ఆవశ్యక గుణం” అన్నారు.

ఐన్‌స్టైన్ వంటి విశ్వవిఖ్యాత శాస్త్రవేత్తతో తాత్విక చర్చలు వేసిన ఆయన నోట ఆ మాటలు అత్యంత సహజంగా అనిపించాయి.

వంగి ఆయన పాదాలకు నమస్కరించాను. నమస్కరించి లేచి నిలబడేంతలో నేనూహించని రీతిలో... ఆ మహానుభావుడు వంగి నా కాళ్లకు దండం పెట్టాడు. విద్యుద్ఘాతం తగిలినవాడిలా కొయ్యబారిపోయాను. (ఇలా చాలామందికి జరిగిందని తర్వాత తెల్సింది)

ఆయన నా భుజం తట్టి వెళ్తూ...

“నేను ఏ విషయంలోనూ నీకంటే భిన్నమైనవాడిని కాను” అన్నారు.

ఒక మహా పీఠాధిపత్యాన్ని అలవోకగా త్యజించిన మహానుభావుడి నోట అలాంటి నిరాడంబరమైన మాటకాక మరొకటి వస్తుందా...

తెల్లటి వస్త్రాల్లో దేవదూతగా వెళ్తూన్న ఆయనకు వెనకనించీ చేతులు జోడించి నమస్కరించాను. ●

*(కృష్ణమూర్తి చిత్రం : బాపు, “బొమ్మ బొరుసు” నుంచి)*